www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 17 ఫిబ్రవరి 2024

5

చిత్తూరు



స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ బాధ్యతలు

ప్రజాశకి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా సుధాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో సీఐ, డీఎస్పీగా పనిచేసిన సుధాకర్‌రెడ్డి జిల్లా కేంద్రంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.



బాధ్యతలు చేపడుతున్న డీఎస్పీ

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి





పలమనేరులో బైక్‌ర్యాలీ



నగరిలో

గ్రామీణ భారత్ బంద్ జయప్రదం



చిత్తూరులో

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్/ నగరి/ పలమనేరు

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకూ యుద్ధం చేయాల్సిందేనని సిఐటియు, ఎఐటియుసి నేతలు పిలుపునిచ్చారు. గ్రామీణ, పారిశ్రామిక భారత్‌బంద్‌లో భాగంగా శుక్రవారం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఎఐటియుసి, సిఐటియు, రైతుసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. చర్చివీధి, పాత మార్కెట్‌వీధి, శేషాపిరాన్ వీధి, ప్రకాశం హైరోడ్డు మీదుగా ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు ఆర్‌వి నర్శింహారావు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు టి.జనార్ధన్, ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.చైతన్య, కె.సురేంద్రన్, ఎఐటియుసి నగర కార్యదర్శి దాసరి చంద్ర, కె.రమాదేవి మాట్లాడుతూ కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. సోమనాథ్ కమిటీ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు 'సీ టు ప్లస్' ప్రకారం మద్దతు ధర చట్టం తేవాలని, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టాన్ని తేవాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఉపాధి హామీ పనిదినాలు 200కు పెంచాలని, ఆహార భద్రతను పటిష్టం చేయాలని నినాదాలు చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులకు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్ర హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, దొరస్వామి, సురేష్, జయశంకర్, సుగుణ, రమణి, ఈశ్వరన్, చిట్టెమ్మ, దాసు, వినాయక, శోభన్‌బాబు, పరదేశి, జ్యోతి, చంద్ర, లోక పాల్గొన్నారు.

నగరిలో

స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని నేతలు డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా విభజించిందన్నారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వేలన్, మురళి పాల్గొన్నారు.

పలమనేరు బంద్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడా గంగరాజు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఏడాది క్రితం ఏడాది పాటు దేశ రాజధాని ఢిల్లీలో రైతులు మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచారన్నారు. అయితే ఇప్పటివరకూ ఆ చట్టాన్ని రద్దు చేయకుండా మోడీ ప్రభుత్వం చాపకింద నీరులా అమలు చేస్తోందన్నారు. దీంతో మళ్లీ రైతులు ఢిల్లీ రోడ్డెక్కారన్నారు. అయితే ప్రభుత్వం విచక్షణారహితంగా లాఠీఛార్జీ చేయడం దుర్మార్గమన్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా గ్రామీణ, పారిశ్రామిక బంద్ జరుగుతోందన్నారు. ఓబుల్‌రాజు, గిరిధర్‌గుప్తా, భువనేశ్వరి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి కృషి

- సేంద్రీయ పంటల సాగుకు అధిక ప్రాధాన్యత
- సలహామండలి సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. బంగారుపాళ్యం మండలం దండువారిపల్లెలో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆర్‌బీకేల రైతులకు విత్తనాలు, పంటలకు సంబంధించి సూచనలు, సలహాలు అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి పెంచుకోవాల్సి అవసరం ఉందన్నారు. తద్వారా నాణ్యమైన ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సౌకర్యాలుయ అధికంగా ఉన్నట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయికి, ప్రభుత్వానికి అందిస్తామన్నారు. తద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ సలహా మండలి ద్వారా వ్యవసాయ రంగాన్ని నిరంతరం పర్యవేక్షణతో పాటు క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు, ఆర్‌బికెల ద్వారా పంటకు కావలసిన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు సరఫరా చేయడం జరుగుతున్నదన్నారు. డిపిఎం వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని, ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన ఉత్పత్తులకు మంచి ధరలు లభిస్తున్నట్లు చెప్పారు. ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని మామిడికి అధిక ధరలు వచ్చేలా చేయడానికి క్షేత్రస్థాయిలో రైతులతో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలోని పశుసంపదకు 95శాతం వ్యాక్సినేషన్ పూర్తైందన్నారు. మేకలు, గొర్రెలకు 75శాతం వ్యాక్సినేషన్ వేసినట్లు తెలిపారు. అనంతరం ఎంపి, డిఏబి ఛైర్మన్, ఇతర అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో సూర్యపటం ఆధారంగా సాగు చేస్తున్న పంటలు, వాటి వివరాలు పరిశీలించారు. సమావేశంలో అధికారులు వెంకటరమణారెడ్డి, శోభారాణి, శ్రీహరి, గంగాభవాని, వ్యవసాయ సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

నా సంతకం.. నా ఓటు.. నా హక్కు.. నా భవిష్యత్తు

- ఓటు హక్కుపై సంతకాల ప్రచారం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నా సంతకం.. నా ఓటు.. నా హక్కు.. నా భవిష్యత్తు అనే నినాదంతో యువత, ఓటర్లు ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని ఏఈఆర్వో, నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ, మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు.. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నగరపాలక కార్యాలయంలో "సంతకాలతో ఓటు హక్కు చైతన్యం" కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 సంవత్సరాలకు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. నా సంతకం.. నా ఓటు.. నా హక్కు అంటూ యువత చేత సంతకాలు చేయించారు. తప్పనిసరిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని పిలుపునిస్తూ యువత సంతకాలు చేశారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు, ఉద్యోగులు, నూతనంగా ఓటు హక్కు పొందిన యువత ఉత్సాహంగా సంతకాలు చేశారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఏసిపీ రామకృష్ణుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


సమస్యలు పరిష్కరించండి

- జెసికి ఏపీ జేఏసీ నేతల వినతి



ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ జేఏసీ నాయకులు శుక్రవారం జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షులు కె.వి రాఘవులు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర జేఏసీ ప్రభుత్వం ముందు ఉంచిన 13రకాల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రఘు, పలువురు ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ముందున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. కేంద్రాలకు బస్సు సౌకర్యం, తదితర అంశాలపై పరిశీలించినట్లు తెలిపారు. ఇందులో సమస్యాత్మక కేంద్రాలపై పోలీసులు దృష్టి సారించాలిని ఆదేశించారు. జిల్లాలో 1,762 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1,266 లొకేషన్‌లలో ఉన్నవని, దీనికి గల నెట్వర్క్ సౌకర్యంపై పరిశీలించినట్లు పేర్కొన్నారు. నెట్వర్క్ సమస్య ఉన్న పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ రోజున సమాచారాన్ని జిల్లా కేంద్రానికి చెరవేసేందుకు నెట్వర్క్ సమస్య లేకుండా చర్యలు చేపట్టేందుకు యంత్రాంగం సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పి ఆరీఫుల్లా, కుప్పం, పలమనేరు ఆర్డివోలు శ్రీనివాసులు, మనోజ్‌రెడ్డి, చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే నగర అభివృద్ధి: మేయర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: సమిష్టి కృషితోనే చిత్తూరు నగర అభివృద్ధి సాధ్యమవుతుందని నగర పాలక మేయర్ అముద అన్నారు. శుక్రవారం కమిషనర్ డాక్టర్ జె.అరుణతో కలిసి నగరపాలక కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. పలు అంశాలను సభ్యులతో చర్చించి ఆమోదించారు. అజెండాలో భాగంగా నగరంలోని దర్గా సర్కిల్ నందు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు రోడ్ సేఫ్టీ ఫండ్/సాధారణ నిధులు 2023- 24 నుండి ఖర్చు చేయడానికి ఆమోదించారు. రానున్న వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాల్లో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేసేందుకు ఇరువారం రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 515/5లో తహశీల్దార్ గుర్తించిన గయాలు 8.45ఎకరాల భూస్వభావమును మార్పు చేయుటకు పరిశీలన నిమిత్తం పంపగా కమిటీ ఆమోదించింది. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు డోర్ టు డోర్ గార్బేజ్ సేకరణ నిమిత్తం నడుస్తున్న 11 ఆటో టిప్పర్‌లకు సంబంధించి డ్రైవర్లు, సూపర్వైజర్లు, మెకానిక్, డీజిల్ బకాయిలను నెలవారి బిల్లు నుండి మినహాయించుకుని చెల్లించడానికి, స్వీపింగ్ మిషన్ వాహనాలను నగరపాలక సంస్థ నిర్వహణ షరతులకు మేరకు వారి సేవలు కొనసాగించుటకు కమిటీ ఆమోదం ముద్ర వేసింది. సమావేశంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జీఆర్ శ్రీకాంత్, సహదేవన్, శోభ, పూర్ణచంద్రరావు, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఏసిపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సత్కారాల వల.. భవిష్యత్ ఎలా..!



- సిఫార్సుకు వం'ధనం'!
- మభ్యపెటేందుకే ప్రోత్సాహకమా..
- వలంటీర్ల ఉద్యోగ భద్రత ఊసేలేదు
- సొంత భజనకు వాడుకున్నారని ఆరోపణలు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్

2019లో అధికారాన్ని దక్కించుకున్న వైసీపీ గ్రామ స్వరాజ్యం పేరిట వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి గ్రామ, పట్టణాల్లో వలంటీర్లను నియమించింది. అయితే అప్పట్లో కొత్తగా నియమించిన సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన జగన్ ప్రభుత్వం వలంటీర్ల విషయంలో పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. వలంటీర్లలో 10వ తరగతి చదివిన వారి నుంచి పీజీ చేసిన వారూ ఉన్నారు. రూ.5వేల వేతనంతో వారి పరిస్థితి బిత్తెడు జీతం బారెడు చాకిరీగా మారింది. అయితే వారి నుంచి ప్రభుత్వం పింఛన్ పంపిణీ మొదలుకొని నానా పనులు చేయించుకుంటోంది. ప్రభుత్వ, పార్టీ కార్యకలాపాలకూ వారినే వాడుకుంటున్నారు.

ప్రోత్సాహం సరే.. ఉద్యోగ భద్రత సంగతేంటి..

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వలంటీర్లలో ఒకింత ఆందోళన నెలకొంది. తిరిగి మరో సారి ప్రభుత్వం వస్తే సరి రాకుంటే తమ వలంటీర్ ఉద్యోగం ఉంటుందో ఊడుతుందోనని మదనపడుతున్నారు. ఎన్నికల వేళ వాడుకోవడానికి ప్రభుత్వం వలంటీర్లకు రెండు నెలల ముందే ప్రోత్సాహం అందించేందుకు 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వారి నుంచి సానుభూతి పొందే ప్రయత్నమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. జీతాల పెంపు, ఉద్యోగ భద్రత అంశాలు పక్కన బెట్టి వలంటీర్లను మభ్యపెట్టేందుకే అధికార పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కార్యక్రమం ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకూ 'వలంటీర్లకు వందనం' పేరిట నగదు ప్రోత్సాహం అందించేలా అధికారులు సమాయత్తమైయ్యారు. ఈ నగదు వలంటీర్ల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో నేరుగా జమకానుంది. కాగా వీరికి మండల, మున్సిపాలిటీల్లో సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజాప్రతినిధుల ద్వారా ప్రశంసా ప్రతాలు అందజేస్తారు. జిల్లాలో సేవా వజ్ర 32మందికి రూ.14.40లక్షలు, సేవా రత్న 182మందికి రూ.54.60లక్షలు, సేవామిత్ర 8,629మందికి రూ.కోటి 94లక్షలు, మొత్తం 8,843మందికి గాను రూ.13కోట్ల 63లక్షలు జమచేయనున్నారు. సేవా వజ్రకు రూ.30వేలు నుంచి రూ.45వేలు, సేవా మిత్ర రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచారు.

సిఫార్సు చేసిన వారికే..!

నవరత్నాలు పథకాలు అమల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి ఈ పురస్కారాలు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా స్థానిక అధికార పార్టీ నేతల సిఫార్సు చేసిన వారికే ఇస్తున్నారని వలంటీర్లు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు.

మభ్యపెట్టేందుకేనా..

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించకుండా.. వేతనాలు పెంచకుండా.. 5ఏళ్లుగా ప్రభుత్వాన్నే నమ్ముకొని చాకిరీ చేస్తున్న వారిని ఆదుకోకుండా వందనమంటూ మభ్యపెట్టదలచుకున్నారా అని ప్రజా సంఘాలు మండితున్నాయి. కార్మికులను పక్కనబెట్టి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీలు ఇచ్చిన హామీలు నెరవేర్చడం మాని కేవలం ఎన్నికల్లో వలంటీర్లను అడ్డంపెట్టుకొని పబ్బం గడుపుకొనేందుకు ప్రోత్సాహం పేరుతో వలంటీర్లకు సొమ్ము వేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఖజానా ఖాళీ అంటున్న ప్రభుత్వానికి ఈ సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందని సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. వలంటీర్లకు ఇవ్వాల్సింది ప్రోత్సాహం కాదు కొలువుకు గ్యారెంటీ అని డిమాండ్ చేస్తున్నారు.

సొంత భజనకు వాడకం..

సాధారణంగా ప్రభుత్వాలు ప్రజా ధనం ద్వారా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తాయి. కానీ రాష్ట్రంలో అందుకు బిన్నంగా కేవలం జగన్ ఇస్తున్నారు.. జగనన్న పంపించాడు అంటూ సొంత భజన చేపించుకొనే పనిలో వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను వాడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో నేరుగా జగన్ ప్రభుత్వమే చేస్తోంది.. ఈ ఎన్నికల్లో ఓటు వేస్తేనే పథకాలు వస్తాయంటూ వలంటీర్లు ద్వారా ప్రయోజనం పొందేందుకు అధికార పార్టీ నేతలు ప్రచారాలకు వాడుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేలం పాటలో రూ.59వేలు ఆదాయం

ప్రజాశక్తి-సోమల: చేపల చెరువుల వేలం పాటలో నడింపల్లి పంచాయతీకి రూ.59వేలు ఆదాయం వచ్చినట్లు ఈవోఆర్డీ లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం నడింపల్లి సచివాలయంలో వేలం పాట నిర్వహించారు. ఐదు చెరువులకు వేలం నిర్వహించగా రూ.58800లు వచ్చిందని పేర్కొన్నారు. గతేడాది రూ.40,700 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.18,300 అధికంగా ఆదాయం సమకూరినట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శి సబిత, సర్పంచ్ వెంకటరమణ, వైస్ ఎంపీపీ ప్రభాకర్ పాల్గొన్నారు.

పెట్రోలియం పైప్‌లైన్ సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-గంగవరం: రైతుల పొలాల గుండా ఏర్పాటైన ఇండియన్ ఆయిల్ పైప్‌లైన్ లీకైన సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని ఒంగోలుపల్లి, పొన్నమ్మకనపల్లి, కేలపల్లి గ్రామాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు పైప్‌లైన్ ఉన్న ప్రాంతంలో తిరుగుతుంటే గుర్తించి రైతులు సమాచారం ఇవ్వాలని కోరారు. వారిని గుర్తించి చెబితే వారికి సంస్థ తరుపున రూ.25వేలు రివార్డు కూడా ఇస్తామన్నారు. ప్రాక్టికల్‌గా ఫైర్, మెడికల్ వంటి శాఖలు ప్రత్యక్షంగా ప్రదర్శన చేసి చూపించారు. కార్యక్రమంలో బాలమురుగన్, రఘువంశీ, రెడ్డెప్ప, రామకృష్ణారెడ్డి, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని కల్లూరుపల్లి సచివాలయంలో సర్పంచ్ బాలాజీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయులు మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. ప్రజా ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వాతి, వైద్యులు శాలిని, సంధ్యారాణి ఎంఎల్‌హెచ్‌ఈవో రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా సామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో ఎస్ఓ స్వరూప, వైస్ సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ, లింగాపురం గ్రామంలో శుక్రవారం అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని వైసిపి మాజీ మండలాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ దీప నేతృత్వంలో వైద్య సేవలు అందించారు. కళ్ళు సమస్యలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'టీడీపీని గెలిపించండి'

ప్రజాశక్తి-గుడిపల్లి: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు శుక్రవారం మండలంలోని యామగానపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వెన్నెలకుప్పకంట్రిక మండల అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు అరుణాచలం, బాలాజీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం ఎంపీడీవోగా శివశంకర్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల ఎంపీడీవోగా శివశంకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా రామాపురం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు.

ఎంపీపీ పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కనమనంబేడు పంచాయతీలోని ఎంపీపీ పాఠశాలను ఎంఈవో ముని సుబ్రహ్మణ్యం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలు భాగంగా విద్యార్థులతో కలిసి వారి వసతులు, పౌష్టిక ఆహారం గురించి, మధ్యాహ్న భోజనం గురించి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాశాఖ అధికారి పిల్లలతో కూర్చొని మధ్యాహ్న భోజనాన్ని తిని ఇంకా రుచికరంగా చేయాలని వంట వారిని ప్రోత్సహించి వారికి సకాలంలో కావాల్సిన ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సంగం థియేటర్ కూడలి వద్ద హీరాబెన్ మోదీ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ దేవరాయల జయంతి సందర్భంగా రాష్ట్ర కాపు నాడు కార్యదర్శి కంకణాల వెంకట నాయుడు ఆధ్వర్యంలో పేదలకు శుక్రవారం దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భాష లందు తెలుగు లెస్స అని తెలుగు భాషను కొనియాడిన మహనీయుడు అని పేర్కొన్నారు. ఆయన తెలుగు భాషకు చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): మండలంలోని శ్రీనివాస మంగాపురం సమీపంలో ఉన్న వెంకట పద్మావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్)లో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బెంగళూరుకు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రజీత్ పాశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత గుండె వైద్య శిబిరం బెంగళూరుకు చెందిన బెలెవెన్ చాంపియన్ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉచిత గుండె వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన వ్యాధులతో పాటు బీపీ, షుగర్, 2డి–ఎకో, కొలెస్ట్రాల్, వ్యాధులకు వైద్య పరీక్షలు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు విమ్స్ ప్రతినిధులు తెలిపారు. పూర్తి వివరాలకు 9059738537, 9053747049 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని విమ్స్ అధికారులు తెలిపారు.

ఎస్వీ క్రీడా మైదానంలో కట్టడాలు నిలిపివేయాలి

చర్చలతో మేధావుల తీర్మానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఎస్‌వి హై స్కూల్ క్రీడా మైదానంలో చేపడుతున్న నిర్మాణాలను వెంటనే ఆపివేయాలని పలువురు మేధావులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రకాశం రోడ్డులోని ఎస్వీ హైస్కూల్ క్రీడా మైదానం పక్కనున్న అంబేద్కర్ భవన్‌లో ఎస్వీ హై స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మేధావులు, ప్రజాసంఘాలతో 'క్రీడామైదానం లో కట్టడాల నిలిపివేయాలి'పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా మైదానాలు చాలా ముఖ్యమని పిల్లలకు చదువులే కాకుండా ఆటలలో ప్రావీణ్యానికి దోహద పడుతాయన్నారు. తక్షణం క్రీడా మైదానంలో కట్టడాల నిలిపివేయాలని ర్యాలీ ని నిర్వహించాలని టిడిపి ఈవో కు లేఖను సమర్పిస్తున్నట్లు తెలిపారు.

వలంటీర్ల వ్యవస్థ చారిత్రాత్మకం: డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-కార్వేటినగరం: వలంటీర్ల వ్యవస్థ దేశంలోనే చారిత్రాత్మకమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేశారు. నవరత్నాల పథకాల అమలులో వారి పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం వలంటీర్లను కొనియాడారు. అనంతరం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడానికి చొరవ తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీపీ లతబాలాజీకు జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, నాయకులు శేఖర్‌రాజు, లోకనాథరెడ్డి, ప్రభాకర్రెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌నాయుడు, మోహన్ మురళి, తహశీల్దార్ పుష్పకుమారి, ప్రత్యేక అధికారి త్రిశూల్, ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి చేశాం.. ఆదరించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వికోట: రాష్ట్రాన్ని అభివృద్ధి చేశాం.. మరింత అభివృద్ధి కావాలంటే సీఎం జగన్‌ని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ఆదరించాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తోటకనుమలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తండ్రి ఆశయాలతో రాష్ట్రాన్ని సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, మండల పార్టీ అధ్యక్షులు బాల గురునాథ్, నేతలు కిషోర్‌గౌడ్, తమీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్న వాలంటీర్లను వరుసగా నాలుగో ఏడాది కూడా సత్కరిస్తున్నందుకు గర్వంగా ఎమ్మెల్యే వెంకటయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం గంగవరం ఎంపీడీఓ కార్యాలయంలో వాలంటీర్లకు నిర్వహించిన "సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాల ప్రదానోత్సవం" ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ సాయం'

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ కృషి చేస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం యదమరి మండల ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన 4విడత వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు మెగా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్, వైస్ ఎంపీపీ రవి, హరినారాయణరెడ్డి, అభివృద్ధి అధికారి సింగన్న, ఈవోపీఆర్డీ హరిప్రసాద్ రెడ్డి, ఏపీఎం కల్పలత రెడ్డి, ఏపీవో బాల తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం: రోజా

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కేవలం జగనన్న ద్వారానే సాధ్యం అవుతుందని మంత్రి రోజా అన్నారు. నగరి రూరల్ మండలం బుగ్గఅగ్రహారంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు.

అమ్మానాన్నలా సేవ చేస్తా: నేదురుమల్లి

ప్రజాశక్తి - బాలాయపల్లి : వెంకటగిరి నియోజకవర్గంలో బాలాయపల్లి మండలానికి అమ్మ నాన్న ఏ గుర్తింపు ఇచ్చారో ఆ గుర్తింపు ఇచ్చి సేవ చేసేందుకు తాను సిద్ధంగా వున్నానని తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నా రు. మండలంలోని జయంపు గ్రామంలో ని మాజీ ఎంపీపీ, వెంకటగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్ రావు, ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి సతీమణిని ఆయన పరామర్శించారు. పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని, బాలాయపల్లి మండలం అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేసేం దుకు సిద్ధంగా వున్నానన్నారు. పనిచేస్తున్న వారికి మంచి స్థానం కల్పిస్తా మన్నారు. ఏ గ్రామంలోనైనా సమస్య ఉంటే నాయకులతో కలిసి పని చేస్తే రేపు వారితో పోరాడి ఓట్లు వేయించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఆయన వెంట మండల వైసిపి కన్వీనర్ వెందోటి కార్తీక్ రెడ్డి, వైసిపి నాయకులు, బాలాయపల్లి సహకార సంఘం అధ్యక్షుడు పల్లంటి రాంబాబు నాయుడు, గుర్రం రామ్మూర్తి యాదవ్,గోపాల్ యాదవ్, మండలం లోని నిడిగల్లు ,పిగిలాం, తదితర గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడితే అక్రమ కేసులా?: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో కొంత మంది అధికారులు వైసిపి కార్యకర్తలు లాగా పనిచేస్తున్నారని టిడిపి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కావాలని పోరాడితే తమ పార్టీ నాయకుల, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వారిని న్యాయస్థానాలు చుట్టూ తిప్పుతూ అధికారులుపైశాచిక ఆనందం పొందుతున్నారని వారు దుయ్యబట్టారు. అక్రమ కేసు బనాయించడంతో పుత్తూరు సీనియర్ సెషన్స్ సివిల్ జడ్జి ముందు టిడిపి నాయకులు, చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు సి షణ్ముగం రెడ్డి, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, టిడిపి అధ్యక్షులు, మాజీ వైస్ ఛైర్మన్ ఎ ఆనంద్, పుత్తూరు మున్సిపాలిటీ, ఏలుమలై రెడ్డి, పుత్తూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు, పదో వార్డు ఇన్‌ఛార్జి రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డి జి ధనపాల్ పాల్గొన్నారు.

వేరుశనగ నూర్పిడి యంత్రం పంపిణీ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వ్యవసాయ అధికారి భారతి ఆధ్వర్యంలో సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందించే వేరుశనగ నూర్పిడి యంత్రా న్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డు తూ రైతులకు సులభ యాంత్రీకరణ వ్యవ సాయంలో భాగంగా వేరుశనగ నూర్పిడి యంత్రాలతో వేరుశనగ రైతులకు శ్రమ, ఖర్చు తగ్గించేందుకు ఉప యోగకరంగా వుండేందుకు బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలోని పద్మావతి ఫార్మర్ ప్రొడ్యూసర్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా రైతుకు సుమారు నాలుగు లక్షల రూపాయలు వ్యయం చేసే వేరుశనగ నూర్పిడి యంత్రాన్ని సబ్సిడీపై వ్యవసాయ అధికారి భారతి చేతుల మీదుగా అందించారు. పద్మావతి ఫార్మాట్ ప్రొడ్యూసర్ చీప్ ప్రమోటర్, సురుటు పల్లి దేవస్థానం బోర్డు నెంబర్, అజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు లక్ష రూపాయలు సబ్సిడీ అందించారు. కనమనంబేడు యువ రైతు కే షణ్ముగంకు యంత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రేవతి గ్రామస్తులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం బేరివాని కండ్రిగ గ్రామానికి చెందిన మునస్వామికి నగరిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన నాల్గు లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడ శాఖ మంత్రి ఆర్ కె రోజా శుక్రవారం పంపిణీ చేశారు. బేరివాని కండ్రిక కి చెందిన మునస్వామి భార్య మంజుల డెంగీతో ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. ఆరోగ్యశ్రీలో సంబంధిత సేవలు లేకపోవడంతో ఇందు నిమిత్తం అయిన ఖర్చును వివరాలతోసహా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసు కెళ్లారు. మృతురాలు మంజుల వైద్యానికి అయిన ఖర్చులను 4లక్షల రూపాయలను భర్త మునుస్వామికి శుక్రవారం చెక్కు రూపంలో అందించారు. చెక్కు అందించినందుకు బాధితుడు కృతజ్ఞతలు తెలుపు కున్నాడు.



ఖాట్మండు యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-క్యాంపస్: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయు), ఖాట్మండు యూనివర్సిటీ నేపాల్ వారు సంయుక్తంగా నేపాల్ లోని ఖాట్మండు యూనివర్సిటీలో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగిన భారత్ నేపాల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్ లో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ భారతి పాల్గొని అక్కడి కాట్మండు యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా రెండు యూనివర్సిటీల మధ్య రీసెర్చ్ కొలాబరేషన్స్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్, డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ వంటి అంశాల ద్వారా రెండు యూనివర్సిటీలు ఒకదానితో ఒకటి సహకరించుకుని ఎన్ఈపి ట్వంటీ ట్వంటీ ద్వారా ఉన్న ఆబ్జెక్టివ్స్‌ని ఫుల్ ఫిల్ చేసుకోగలుగుతామని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ, సెట్విన్ డిఎస్ఏ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జా తీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మాతృభాష పరిరక్షణలో యువత పాత్ర' అంశంపై వ్యాసరచన పోటీని, "తెలుగు భాష– సంస్కృతి" అనే అంశం పై కవిత్వ పోటీలను నిర్వ హించారు. ఇన్ ఛార్జ్ తెలుగు శాఖాధ్యక్షులు డా.వై.సుభాషిణి మాట్లాడుతూ మాతృభాషలో జ్ఞానా న్ని సంపాదించిన వ్యక్తి ఎందు లోనైనా అభివృద్ధిని సాధి స్తాడని, యువత ప్రతి ఒక్కరూ మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు.

'బృందావన్ 'లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



బహుమతులు ప్రదానం చేస్తున్న ద్వారకనాథరెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని సంతపేట బృందావన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి, పాఠశాల డైరెక్టర్ ప్రియతేజ తెలిపారు. ముఖ్యఅతిథిగా అడ్వకేట్ బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ద్వారకానాథరెడ్డి హాజరై మాట్లాడుతూ పిల్లల్లో క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని తెలిపారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇంగ్లీషు, తెలుగు భాషలలో విద్యార్థులు వివిధ నాటకాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు వివిధ నృత్యాలను ప్రదర్శించారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాహనంపై స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఏఈవో పార్థసారథి, టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్, వేద పండితులు, దాశరథి, గోపాలాచారి, వేదపారాయణులు శివరామ శర్మ, షరాబ్ బాబుసురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: రథసప్తమి సందర్భంగా వేపంజేరిలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. శుక్రవారం స్వామి వారు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, శేఖర్ స్వామి, గౌరీష్‌గర్గ్ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: నగరంలోని బి.వి రెడ్డి కాలనీలో టీడీపీ చిత్తూరు నియోజకవర్గం సీనియర్ నాయకులు గురజాల జగన్ మోహన్ నూతన స్వగృహంలో రథసప్తమిని పురస్కరించుకొని డా.బాలకృష్ణ గురూజీ ఆధ్వర్యంలో సూర్య భగవానుడికి ఆదిత్య హృదయ పారాయణం, రాజ్యలక్ష్మి, రాజ్య శ్యామల యాగం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పులివర్తి నాని, దొరబాబు, బాలాజీనాయుడు, సి.ఆర్ రాజన్, సురేంద్ర కుమార్, కోదండ యాదవ్, సుబ్బనాయుడు, శశికర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్' చిత్రంతో భయపడ్డ జగన్: కురుగొండ్ల

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వ కుట్రలు కోర్టు తీర్పుతో బద్దలయ్యాయని, రాజధాని విషయంలో జగన్ చేసిన విష ప్రచారం, అమరావతి విధ్వంసంపై సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారని దీంతోజగన్‌కు భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక పాలకుడి కుట్రలతో ప్రజా రాజధాని ఎలా విధ్వంసం అయ్యిందో చూపించారన్నారు. ప్రభుత్వం టెర్రిరిజంతో చేసిన విధ్వంసం ఈ సినిమా ద్వారా అందరికీ చేరుతుందని జగన్‌కు వణుకు మొదలైందన్నారు. సొంత పార్టీ నేతల ద్వారా కేసులు వేసి సినిమాను అడ్డుకునేందుకు యత్నించాడన్నాడు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పులుకొల్లు రాజేశ్వరావు, అవ్వారు సత్యనారాయణ, రూరల్ మండల అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి, పార్లమెంట్ కార్యదర్శి మగ్గం వెంకటాచలం, రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యులు తాండవ చంద్రా రెడ్డి పాల్గొన్నారు.

'తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా'

ప్రజాశక్తి -గూడూరు రూరల్: తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా సౌకర్యాన్ని తపాలా శాఖ అందిస్తోందని ఆ శాఖ సూపరింటెండెంట్ ఎస్–ఎస్ వీఏకే కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ప్రధాన పోస్టల్ కార్యాలయంలో తపాలా శాఖలో జీఏజీ ప్రమాద పాలసీ చేసుకొని ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రమాద బీమా పరిహారం రూ.10 లక్షల చెక్కును ఆయన బాధితురాలికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక ప్రీమియం రూ. 555 తో పది లక్షల ప్రమాద బీమా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ బీమా తో ప్రమాదం వల్ల మృతి చెందినా, అంగవైకల్యం సంభవించినా రూ. 10 లక్షలు, హాస్పిటల్ ఖర్చులు లక్ష, ఒకసారి హెల్త్ చెకప్, టెలి కన్సల్టేషన్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. రోడ్ యాక్సిడెంట్, పిడుగుపాటు, కరెంటు షాక్, పాముకాటు వంటి ప్రమాదాలకు బీమా పొందవచ్చన్నారు. ఈ పాలసీలు ప్రతి పోస్ట్ ఆఫీస్ లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది, ఏఎస్పీ బి మణికంఠన్, ఐపీపీబీ సీనియర్ మేనేజర్ శరత్ కుమార్, మేనేజర్ వేణు, అసిస్టెంట్ మేనేజర్ గురుభావన్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: సీఐ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పిల్లలకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందిం చుకో వచ్చని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణ సమీపం లోని గోగినేని పురంలోని ఆదిశంకర పాఠశా లలో వార్షిక క్రీడా పోటీలు శుక్రవారం నిర్వహిం చారు. రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి పాల్గొని క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల మానసిక, శారీరక ఉల్లాసం పెరుగుతుందని నేటి పరిస్థితుల్లో పిల్లలు ఎక్కువగా టీవీలు, సెల్ ఫోన్లకు టైం కేటాయిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని క్రీడలలో గెలుపు ఓటములు అర్థం చేసుకుంటారని అవి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ రూపవతి, మల్లికార్జున్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాయలవారి జీవితం ఆదర్శనీయం : టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయల వారి జీవితం అందరికి ఆదర్శనీయమని తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి ఛైర్మన్, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి లీలామహల్ సర్కిల్లో శుక్రవారం శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ పున: ప్రతిష్ట ఆవిష్కరణ కార్యక్రమంలో భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయం ముద్రనారాయణ పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయులు ప్రజా పరిపాలన అద్భుతంగా సాగించారని, ఓవైపు ప్రజల క్షేమం, మరోవైపు కళలు, సంస్కృతి, ఆచారాలు, భక్తి వీటినన్నింటిని మేళవించుకొని పరిపాలన చేసిన గొప్ప చక్రవర్తి అని కొని యాడారు. తన ఇరవై సంవత్సరాల పాలనలో తిరుమల వేంకటేశ్వర స్వామి వారిని ఏడు సార్లు దర్శించుకొని, వేల కోట్ల విలువ గల్గిన అభరణాలు స్వామికి సమర్పిం చి, స్వామి కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప చక్రవర్తి అన్నారు.

యువత 'మత్తు' వీడాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యువత మత్తు వ్యసనాల నుంచి బయటపడి ఉత్తమ సమాజ నిర్మాణం కోసం బాటలు వేయాలని జమఅతే ఇస్లామీ హింద్ తిరుపతి నగర అధ్యక్షుడు అమీర్ బాషా పిలుపు నిచ్చారు. స్థానిక బహదూర్ పేట మస్జిద్ మహమ్మదీయలో జమ అతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలనపై కరపత్రాలు, గోడ పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అమీర్ బాషా మాట్లాడుతూ నేటితరం యువత మత్తు పదార్థాల బారినపడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటి నుంచి బయటపడితేనే యువతకు, సమాజానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పిలుపు నిచ్చారు. జమ అతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల రుణాలు మాఫీ : మాజీ కేంద్రమంత్రి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలోని ఎస్సీ, ఎస్టీల రుణాలను మాఫీ చేస్తామని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ అన్నారు. శుక్రవారం ఆయన ఏపీ రాజధాని అంశంపై మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రాజధానిగా తొలుత తిరుపతిగా అనుకున్నారని, అది కాస్త కర్నూలుగా మారిందని, ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలిందని, అక్కడినుంచి తుళ్లూరు వచ్చిందని నేడు విశాఖ అంటున్నారన్నారు. తిరుపతిని రాష్ట్రానికి ప్రధాన నగరంగా చేస్తారని కాలజ్ఞాని బ్రహ్మంగారు 300 ఏళ్ల కిందటే చెప్పారని గుర్తు చేశారు. నీరు మీకు–రాళ్లు మాకా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కి అధికారం ఇస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల్లో ఉన్న అన్ని వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

వైసిపి అవినీతిని ఎండగట్టాలి: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వైసిపి ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనను ఎండగట్టాలని టిడిపి పుత్తూరు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అన్నారు. పుత్తూరు రూరల్ మండలం వేపగుంట, పరమేశ్వరమంగళంలో స్థానిక టిడిపి, జనసేన నేతలతో కలసి 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తు గ్యారెంటీ'ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అవినీతిని ఎండగట్టాలని కోరారు. నాలుగేళ్ల కాలంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. యువత నిరుద్యోగులై రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండలం వేపగుంట, పరమేశ్వర మంగళం స్థానిక టిడిపి , జనసేన నాయకులు పాల్గొన్నారు.

10 వేల ఎకరాలకు సాగునీరు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక స్వర్ణముఖి నదిపై చెక్ డ్యామ్ నిర్మాణానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.53.62 కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్ పనులు పూర్తి కానున్నాయి. చెక్ డ్యామ్ పనులు పూర్తయితే చెంబేడు కాలువ ద్వారా తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, నెల్లూరు జిల్లాలోని పెళ్లకూరు మండలాల పరిధిలో 10,200 ఎకరాలకు అదనంగా సాగునీటిని అందించే అవకాశం కలుగుతుందన్నారు. తద్వారా రైతన్నలు ప్రజలకు ఎక్కడ నీటి కష్టం లేకుండా ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణయ్య, జెడ్పిటిసి సంధ్యారాణి పాల్గొన్నారు.

బృందమ్మ కాలనీలో తాగునీటి పరిష్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని బృందమ్మ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు బొజ్జల రిషిత రెడ్డి పరిష్కారం చూపారు. ఇంటింటికి బొజ్జల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె బృందమ్మ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తాగునీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి తో మాట్లాడి వెంటనే కాలనీలో బోరు ఏర్పాటు చేయించారు.

వలస 'బతుకు'లు

రాజస్థాన్ నుంచి ఓజిలికి..

ప్రజాశక్తి - ఓజిలి: 'కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫురింపచేసే.. గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి సహస్ర వత్తుల సమస్త చిహ్నాలు' అని శ్రీశ్రీ దేశంలో చేతివృత్తులను కీర్తిస్తూ రాసిన కవిత్వం ఇక్కడ గుర్తు రాకమానదు. భాష, ప్రాంతం వేరైనా. జీవన పోరాటం ముందు అన్నీ బలాదూర్. ఆధునిక యుగంలో మరయంత్రాలతో పోటీపడి ఎండకు, చలికి తట్టుకొని కమ్మరి పని చేస్తూ జీవన పోరాటం సాగిస్తున్నారు.

రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కుటుంబాలు పిల్లాజెల్లలతో ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జిల్లా ఓజిలి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రతి ఏటా వలస వస్తుంటారు. రోడ్డు పైనే వంటా వార్పు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆడ, మగ, పిల్లలు, ముసలి అన్న తేడా లేకుండా అందరూ కష్టపడతారు. ఇనుమును కొలిమిలో కాల్చి రకరకాల పనిముట్లు తయారు చేస్తున్నారు. కఠినమైన ఇనుమును కరిగించి కావలసిన రీతిలో మలచి పనిముట్లు తయారు చేసే వీరికి తమ జీవితాలు ఎలా మలుచు కోవాలో తెలియదు. సంచార జాతి వలె చలికి, ఎండకు తట్టుకొని బతుకు బండి లాగుతున్నారు. పండు ముసలి మొదలు పాలుతాగే పిల్లలు వరకు ఇదే పనిలో ఉంటున్నారు. లారీ కమాన్ ముక్కలు కేజీ రూ.30 చొప్పున కొనుగోలు చేస్తారు. కొలిమి కాల్చడానికి బొగ్గును కొంటారు. వీటి ద్వారా కొలిమి కాల్చి వివిధ రకాల ఇనుము పనిముట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. రోజుకు సుమారుగా రూ. 4 వేలు నుండి రూ. 5 వేలు వరకు అమ్మకాలు ఉంటాయని మహేందర్ సింగ్ తెలిపారు. పెట్టుబడి పోను మిగిలింది వీరి కష్టానికి ప్రతిఫలం. కుటుంబమంతా ఒళ్లొంచి పనిచేస్తే గాని వీరి నోట్లోకి ముద్ద పోదు. వీరి పిల్లలకు బడులుండవు. వీరితో పాటే వారూ సంచార జీవనం గడపాల్సిందే.



కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కడుపు నొప్పి తాళలేక ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం మండలంలోని పాలేరు గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం కథనం మేరకు.. పాలేరు గ్రామానికి చెందిన ఆనందయ్య(65) గత కొన్ని రోజులుగా క్యాన్సర్ వ్యాధిన పడి పలు ఆసుపత్రిలో చికిత్సలు పొందాడు. వ్యాధి నయం కాకపోవడంతో శుక్రవారం తీవ్ర కడుపునొప్పితో బాధపడ్డాడు. జీవితంపై విరక్తి చెంది మామిడి తోపు సమీపంలో ఉరివేసుకొని మృతి చెందాడు. అనంతరం శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.